సాక్షి
మహబూబ్‌నగర్
ఆదివారం । 26 । మార్చి । 2023



'ప్రసాద్ స్కీం' పరిశీలన

అలంపూర్‌లో చేపడుతున్న అభివృద్ధి పనులను కలెక్టర్ క్రాంతి పరిశీలించారు.

వివరాలు 8లో ▸



రైల్వే విద్యుద్దీకరణ

గద్వాలలో రైల్వే ట్రాక్ విద్యుద్దీకరణ పనులను చీఫ్ ఇంజినీర్ మిశ్రా పరిశీలించారు.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
35.4 /22.6

ఉదయం వేళలో ఆకాశం నిర్మలంగా ఉంది. అప్పుడప్పుడూ మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఎండగా ఉంటుంది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ 6-36
(ఆదివారం సాయంత్రం)

సహర్ 4-56
(సోమవారం తెల్లవారుజామున)

న్యూస్‌రీల్

రెండ్రోజుల్లో ధ్రువపత్రాలు జారీ చేయాలి

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ప్రీమెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు అవసరమైన కులం, ఆదాయ ధ్రువపత్రాలు రెండ్రోజుల్లో జారీ చేయాలని తహసీల్దార్లను కలెక్టర్ రవినాయక్ ఆదేశించారు. శనివారం మండల ప్రత్యేకాధికారులు, తహసీల్దార్లు, ఎంఈఓలు, సంక్షేమ శాఖల అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్ మంజూరులో భాగంగా జిల్లాలో 11,500 మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు ఉండగా ఇప్పటి వరకు 7 వేల మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారన్నారు. మిగిలిన వారితో రెండు రోజుల్లో దరఖాస్తు చేయించేలా అధికారులు కృషిచేయాలన్నారు. స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకున్న 7,120 మంది విద్యార్థుల్లో 473 మందికి మాత్రమే బ్యాంకు ఖాతాలు ఉన్నాయని, మిగిలిన వారికి సోమ, మంగళవారాల్లో బ్యాంక్ అకౌంట్లు తెరిచేలా ఎల్‌డీఎం బ్యాంకు మేనేజర్లు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీఈఓ యాదయ్య, ఎల్‌డీఎం భాస్కర్, గిరిజన సంక్షేమాధికారి చత్రునాయక్, ఎస్టీ అభివృద్ధి శాఖ డీడీ పాండు, తహసీల్దార్లు, ఎంఈఓలు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వే చేపట్టాలి



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్లు ప్రత్యేక శిబిరం నిర్వహించడంతో పాటు దత్తత తీసుకున్న గ్రామాల్లో ఇంటింటి సర్వే చేపట్టాలని పీయూ రిజిస్ట్రార్ గిరిజా మంగతాయారు అన్నారు. శనివారం పీయూ పరిధిలోని ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులకు ఒకరోజు వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం, యువజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు సాధారణ ఉపాధిలో లేని యువతపై ఈ నెల 31లోగా ఈ సర్వే చేయాలన్నారు. ఆయా గ్రామాల్లో 15-29 ఏళ్లలోపు యువకులను గుర్తించి పూర్తి వివరాలు సేకరించాలన్నారు. దీనిపై ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లకు సమగ్ర శిక్షణ ఇవ్వాలన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ ప్రవీణ మాట్లాడుతూ నైపుణ్యాభివృద్ధిలో ఈ కేటగిరీలోని యువతను ప్రోత్సహించాలన్నారు. ఎప్పటికప్పుడు సెల్‌కు ఫారాలను అందజేయాలన్నారు. అనంతరం ప్రశ్నపత్రం ఎలా నింపాలో మాస్టర్ ట్రైనర్ అర్జున్‌కుమార్ వివరించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు చిన్నదేవి, రాఘవేందర్, సుభాషిణి, గాలెన్న, జ్ఞానేశ్వర్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

వేరుశనగ @ రూ.7,495

జడ్చర్ల/దేవరకద్ర: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో శనివారం వేరుశనగ క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.7,495, కనిష్ఠంగా రూ.3,869 ధరలు లభించాయి. అదేవిధంగా మొక్కజొన్నకు గరిష్ఠంగా రూ.2,200, కనిష్ఠంగా రూ.1,677, పెబ్బర్లు సరాసరిగా రూ.5,311, కందులు గరిష్ఠంగా రూ.7,495, కనిష్ఠంగా రూ.3,869, ఆముదాలు గరిష్ఠంగా రూ.6,252, కనిష్ఠంగా రూ.6,049, పత్తికి గరిష్ఠంగా రూ.7,229, కనిష్ఠంగా రూ.5,809 చొప్పున పలికాయి.

కందుల ధర రూ.6,209

దేవరకద్ర మార్కెట్ యార్డులో శనివారం జరిగిన ఈనామ్ టెండర్లలో ఆముదాల ధర క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.6,209, కనిష్ఠంగా రూ.6,119 ధరలు నమోదయ్యాయి. సీజన్ లేకపోవడంతో మార్కెట్‌కు కేవలం ఆముదాలు మాత్రమే అమ్మకానికి వచ్చాయి.

'కురుమూర్తి'లో రాజగోపురం కలశాల ప్రతిష్ఠ



చిన్నచింతకుంట: మండలంలోని అమ్మాపురంలో వెలసిన కురుమూర్తిస్వామి రాజగోపురం కలశాల ప్రతిష్ఠాపన ఉత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో మొదటిరోజు ఆలయంలో తోరణ, ధ్వజ పూజ, దిక్పాలక పూజ, వాస్తు పూజ, హోమాలు, కలశ పూజ నిర్వహించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందించారు.



టమాట నారు నాటుతూ.. వరికి ఎరువు చల్లుతూ.. మొక్కజొన్నకు పిచికారీ చేస్తున్న రావేఫ్ విద్యార్థినులు

పొలం బడి

- అన్నదాతలకు అండగా విద్యార్థినులు
- క్షేత్రస్థాయి పరిశీలనలో వ్యవసాయ విశ్వవిద్యాలయ అమ్మాయిలు
- రావేప్ పేరిట గ్రామాల్లో రైతులకు అవగాహన

వారంతా పట్టణాల్లో మట్టి వాసన తెలియకుండా పెరిగారు. వారి కుటుంబాల్లో పెద్దగా ఎవరూ వ్యవసాయం చేసే వారు లేరు. కాలు, చేతికి మట్టి అంటకుండా ఉద్యోగం చేసే అవకాశమున్నా.. భూమినే నమ్ముకున్న రైతులకు మేలు చేయాలనే ఉద్దేశంతో వ్యవసాయాన్ని వృత్తిగా ఎంచుకున్నారు. ప్రస్తుతం రాజేంద్రనగర్‌లోని ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, పాలెం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో చదువుకుంటున్న నాలుగో సంవత్సరం విద్యార్థులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తున్నారు. ఈ మేరకు రూరల్ అవెర్నెస్ వర్క్ ఎక్స్‌పీరియన్స్ ప్రోగ్రాం (రావేప్) పేరిట శిక్షణ పొందుతూ రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. మొత్తం 51మంది విద్యార్థులు పది గ్రామాల్లో పర్యటిస్తున్నారు. అందులో కార్వంగలో నలుగురు, బొందలపల్లిలో ఆరుగురు, దాసుపల్లిలో ఐదుగురు, మాధారంలో నలుగురు, గౌరిటాలో ఆరుగురు, కుమ్మెరలో ఐదుగురు, మంగనూర్‌లో ఐదుగురు, తుమ్మల్‌సుగూర్‌లో ఐదుగురు, చేగుంటలో ఐదుగురు, అవంచలో ఆరుగురు విద్యార్థులు క్షేత్రపరిశీలనలో ఉన్నారు. ఈ సందర్భంగా వారి అనుభవాలను 'సాక్షి'తో పంచుకున్నారు.

– సాక్షి, మహబూబ్‌నగర్ డెస్క్

వ్యవసాయం క్లిష్టమైంది..



నేను గ్రామీణ వాతావరణంలోనే పెరిగాను. కానీ, వ్యవసాయంతో ఎలాంటి అనుబంధం లేదు. వ్యవసాయ విద్యను అభ్యసించిన తమకు రావేప్ కార్యక్రమం కింద క్షేత్రస్థాయిలో రైతుల నుంచి, వారి అనుభవాల నుంచి మేము నేర్చుకున్నది చాలా ఎక్కువ. ఆవంచలో రైతులు వాణిజ్య పంటలపై మొగ్గు చూపుతున్నారు. వారు పసుపు పచ్చ మిర్చి నూతనంగా సాగు చేస్తున్నారు. ఈ పంట సాగు చేయడానికి రైతులు క్షేత్రస్థాయిలో ఎంత కష్టపడతారో ప్రత్యక్షంగా చూస్తున్నాం. అందుకే వ్యవసాయ చాలా క్లిష్టమైన వృత్తి.

– పవిత్ర, దర్శించర్ల, సూర్యాపేట జిల్లా

గ్రామాలే వ్యవసాయ కళాశాలలు..



రావేప్ కార్యక్రమం ద్వారా రైతుల జీవన విధానం, వారి మధ్య సామాజిక బంధాలు తెలుసుకున్నాం. రావేప్ కార్యక్రమం కింద తిమ్మాజిపేట మండలంలోని చేగుంటలో రైతులు ఎదుర్కొనే సమస్యలు గుర్తించి వాటికి కొన్ని పరిష్కార మార్గాలు వివరించాం. గ్రామంలోని చెరువుల్లో నీటి లభ్యత, నేలల తీరు, క్షేత్రస్థాయి పంటల సాగు విధానం, పాడి, గొర్రెలు, కోళ్లు, చేపల పెంపకం వంటి వాటి గురించి ప్రత్యక్షంగా తెలుసుకున్నాం. గ్రామాల్లో నేర్చుకోవాల్సింది చాలా ఉంది. అందుకే గ్రామం నాకు మరో వ్యవసాయకళాశాల.

– మేధ, నిట్టూర్, పెద్దపల్లి జిల్లా

విజ్ఞానం తప్పనిసరి..



మాది వ్యవసాయ కుటుంబమే. వ్యవసాయంలో చీడపీడలు, సాగు విధానం తెలుసు. కానీ పూర్తిస్థాయిలో తెలియదు. వ్యవసాయ విద్యను అభ్యసించిన తర్వాత నేర్చుకోవాల్సింది చాలా ఉందని తెలుసుకున్నా. అందులో భాగంగానే వరిలో కాండం తొలుచు పురుగు సమస్యతో బాధపడుతున్న మాధారంలోని రైతులకు మా సూచనలతో ఆ సమస్య తీరిపోయింది. వ్యవసాయంలో క్షేత్రస్థాయి సేద్యానికి కొంత వ్యవసాయ పరిజ్ఞానం తప్పక ఉండాలి. రైతులు మూస పద్ధతిలో చేసే వ్యవసాయం కంటే వారికి కొంత విజ్ఞానం అందిస్తే మరింత లాభం ఉంటుంది. వ్యవసాయంలో అనుభవంతో పాటు విజ్ఞానం కూడా ఉండాలని గుర్తించాను.

– శ్రావణి, మాదారం, లింగాల మండలం

కాటన్ ట్రేడింగ్ కుటుంబం



వరంగల్‌లో మా నాన్న కాటన్ ట్రేడింగ్ వ్యాపారం చేస్తుంటారు. వ్యవసాయ భూమి ఉంది కానీ, వ్యవసాయం గురించి ఏమీ తెలియదు. ఇప్పుడు వ్యవసాయంలో సేంద్రియ వ్యవసాయం దాని ప్రాముఖ్యత తెలుసుకున్నా. ఈ గ్రామంలో కొందరు రైతులు సేంద్రియ వ్యవసాయం ఎలా చేస్తున్నారో గమనిస్తున్నా. ఏజీ బీఎస్సీ అనంతరం మా వ్యవసాయ క్షేత్రంలో సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తుల్ని పండించి వాటిని మా కుటుంబానికి, బంధువులకు పరిచయం చేస్తాను. గ్రామంలోని రైతుల వద్ద క్షేత్రస్థాయిలో పనిచేసి వారి వద్ద మరింత నేర్చుకుంటున్నాం.

– ప్రపూర్ణ, వరంగల్

యాంత్రీకరణపై అవగాహన..



మాది పూర్తిగా పట్టణ వాతావరణం. వ్యవసాయ భూమి లేదు. అమ్మానాన్న ఉద్యోగం చేస్తుంటారు. గ్రామంలో ఉండటం మొదటిసారి. ఇక్కడ రైతులు ఎక్కువగా సంస్కృతి సంప్రదాయాల్ని పాటిస్తారు. వీరి నుంచి నేనూ కొన్ని అలవర్చుకున్నాను. వ్యవసాయంలో కూడా వాటిని పాటిస్తారు. పుస్తకాలకు, క్షేత్రస్థాయిలో చేసే వ్యవసాయానికి చాలా వ్యత్యాసం గమనించా. మంగనూర్‌లో రైతులు యాంత్రీకరణను ఉపయోగించడం లేదు. దానిపై ఎక్కువగా తాము అవగాహన కల్పించాం. చిన్నచిన్న యంత్ర పరికరాలు ఉపయోగించడం వలన కూలీల కొరతతో పాటు పనులు వేగవంతం అవుతాయని వివరించాం. యంత్రాల పనితీరు గురించి వీడియోల ద్వారా మరింత అవగాహన కల్పిస్తున్నాం.

– నక్షత్ర, కరీంనగర్

ఇష్టంతో చేయాలి



సండే స్పెషల్

రైతులు వ్యవసాయాన్ని కష్టంగా కాకుండా ఇష్టంతో చేస్తేనే అధిక దిగుబడులు సాధించవచ్చని పాలెం వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బీఎస్సీ నాలుగో సంవత్సరం విద్యార్థిని ప్రియాంక పేర్కొన్నారు. ఈమెది ప్రకాశం జిల్లాలోని మార్కాపురం కాగా.. తండ్రి కాటంరాజు మాజీ సైనిక ఉద్యోగి, తల్లి నారాయణమ్మ గృహిణి. 50 రోజులుగా మండలంలోని బొందలపల్లిలో రైతులు చేస్తున్న వ్యవసాయ క్షేత్రాలను పరిశీలిస్తూ పంటలను ఆశిస్తున్న తెగుళ్ల నివారణకు సూచనలు, సలహాలు అందిస్తున్నారు. రైతులు ఎప్పుడూ వ్యవసాయాన్ని ఇష్టంతోనే చేయాలని అప్పుడే అధిక దిగుబడులు సాధించడానికి వీలవుతుందని చెబుతున్నారు. ప్రస్తుతం పెరుగుతున్న సాంకేతికతను ఒకవైపు అనుసరిస్తూనే.. రసాయనిక ఎరువులకు బదులు పాత పద్ధతిలోని సేంద్రియ ఎరువులను వాడి అధిక దిగుబడులు సాధించవచ్చని సూచిస్తున్నారు.

శాస్త్రీయ పద్ధతులు..



రైతులు ప్రస్తుత టెక్నాలజీలో సాగు చేసుకుంటున్న కమర్షియల్ పంటల్లో అధిక దిగుబడులు పొందేందుకు శాస్త్రీయ పద్ధతులు అవలంబించాలని బొందలపల్లిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న రావేప్ విద్యార్థిని సాయిఇంద్రాణి చెబుతున్నారు. ఈమెది ఖమ్మం సొంతూరు కాగా.. తండ్రి వెంకటేశ్వర్‌రావు వ్యాపారవేత్త, తల్లి ప్రశాంతి గృహిణి. తాను అమ్మ ప్రోద్బలంతో ఏజీబీఎస్సీలో చేరానన్నారు. బొందలపల్లి క్యాంపులో భాగంగా మిరప పంటను ఆశిస్తున్న రసం పీల్చు పురుగు, తామర పురుగు నివారణ కోసం పంట క్షేత్రంలో నీలం రంగు, పసుపు రంగు జిగురు అట్టలను ఏర్పాటు చేసుకోవాలని రైతులకు సూచిస్తున్నారు. పంటల్లో వస్తున్న మార్పులను గమనించి రసాయనిక మందులను పిచికారీ చేసుకోవాలని, అప్పుడే అధిక దిగుబడులు వస్తాయని చెబుతున్నారు.

రైతులకు అండగా..



తాము చదువుకుంటున్న ఏజీబీఎస్సీ డిగ్రీ పూర్తి కాగానే రైతులకు అందుబాటులో ఉండి వారు చేస్తున్న వ్యవసాయంలో మెళకువలు నేర్పిస్తూ అండగా ఉంటామని పాలెం వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బీఎస్సీ 4వ సంవత్సరం విద్యార్థిని ఉషశ్రీ పేర్కొన్నారు. ఈమె సొంతూరు గద్వాల కాగా.. తండ్రి తిరుమలేశ్ పోలీస్ కానిస్టేబుల్, తల్లి లక్ష్మి గృహిణి. తాను వ్యవసాయంపై మక్కువతోనే బీఎస్సీలో చేరినట్లు చెప్పారు. బొందలపల్లి రావేప్ క్యాంపులో భాగంగా రైతులకు వ్యవసాయంలో మెళకువలు నేర్పుతూ మిర్చి పంటను ఆశిస్తున్న తెగుళ్ల నివారణకు సూచనలు చేస్తున్నారు. రసం పీల్చే పురుగు నివారణకు రైతులు తగు మోతాదులో రసాయనిక మందులను పిచికారీ చేసుకోవాలని సూచిస్తున్నారు.

ఆనందంగా ఉంది..



తరగతి గదిలో చదువుకున్న దానిని రైతులతో కలిసి వ్యవసాయక్షేత్రంలో పనిచేయడం తమకెంతో ఆనందంగా ఉందని పాలెం వ్యవసాయ విశ్వవిద్యాలయంలో 4వ సంవత్సరం ఏజీబీఎస్సీ చదువుతున్న శ్రీలేఖ పేర్కొన్నారు. తన తండ్రి శ్రీనివాస్‌గౌడ్ ప్రైవేట్ ఉద్యోగి కాగా.. తల్లి సరిత గృహిణి. మొక్కజొన్నను ఆశిస్తున్న కత్తెర పురుగు నివారణకు రైతులు మొక్కముయ్యిలో క్రిమిసంహారక మందులు వేసుకోవాలని అప్పుడే పురుగు చనిపోయి పంట ఏపుగా పెరుగుతుందన్నారు. తద్వారా అధిక దిగుబడులు వస్తాయని, అంతే కాకుండా పంటలో కలుపు నివారణ చేసుకోవాలని రైతులకు వివరిస్తున్నారు. రైతులతో కలిసి పనిచేయడం తమకెంతో ఆనందాన్ని ఇస్తుందని, భవిష్యత్‌లోనూ రైతులతో మమేకమై పనిచేస్తామని పేర్కొంటున్నారు.

గ్రూప్-1 పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: గ్రూప్–1 (ప్రిలిమ్స్) పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే ఉమ్మడి జిల్లాకు చెందిన నిరుద్యోగ యువతీ, యువకులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ స్వప్న శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, నారాయణపేట జిల్లాలకు చెందిన అభ్యర్థులు ఈ నెల 28లోగా నేరుగా మెట్టుగడ్డలోని తమ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు. గతంలో గ్రూప్–1 ప్రిలిమ్స్‌లో అర్హత సాధించిన వారికి 50 శాతం వెయిటేజీ ఇస్తామన్నారు. రెండు నెలల పాటు కొనసాగే శిక్షణకు పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీలో 60 శాతం మార్కులతో పాసైన వారు మాత్రమే అర్హులన్నారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.5 లక్షలలోపు ఉండాలని, పూర్తి వివరాలకు ఫోన్ నం.08542- 293790లో సంప్రదించాలని సూచించారు.

సమష్టి కృషితోనే గ్రామాల అభివృద్ధి

- ఉత్తమ పంచాయతీల అవార్డుల ప్రదానోత్సవంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ప్రజాప్రతినిధులు, అధికారుల సమష్టి కృషితోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. 2023 జాతీయ పంచాయతీ అవార్డుల కార్యక్రమంలో భాగంగా శనివారం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయిలో ఉత్తమ పంచాయతీలుగా ఎంపికైన 27 గ్రామాలకు పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ అన్నిరంగాల్లో దేశంలోనే అగ్రగామిగా నిలుస్తుందని, 97 శాతం రక్షిత మంచినీటిని సరఫరా చేస్తున్న ఏకైన రాష్ట్రం తెలంగాణ మాత్రమే అన్నారు. ఇతర రాష్ట్రాల్లో ప్రసిద్ధ ప్రాంతాలు, పుణ్యక్షేత్రాల్లో సైతం కనీస సౌకర్యాలు లేక అస్తవ్యస్తంగా ఉన్నాయన్నారు. రాష్ట్రంలోని జిల్లా కలెక్టరేట్లు జార్ఖండ్ రాష్ట్ర సచివాలయానికి మించి ఉన్నాయని కితాబిచ్చారు. ప్రతి గ్రామంలో పల్లె ప్రకృతి వనాలు, సెగ్రిగేషన్ షెడ్లు ఉన్నాయన్నారు. ప్రతి గ్రామంలో గత ఎనిమిదేళ్లలో ఖర్చు పెట్టిన వివరాలతో బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. 2014 ముందు గ్రామాలు.. ఇప్పటి గ్రామాలను బేరీజు వేసుకోవాలని సూచించారు. నిరంతరం పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపడుతుండటం వల్ల రోగాలు తగ్గాయని, అవార్డులు పొందిన గ్రామాలు స్ఫూర్తిని కొనసాగించాలని కోరారు.

■ కలెక్టర్ రవినాయక్ మాట్లాడుతూ తెలంగాణలోని గ్రామాల్లో పరిస్థితి పూర్తిగా మారిపోయిందని, పల్లె, పట్టణ ప్రగతి ఆధారంగా చేస్తున్న కార్యక్రమాలు సత్ఫలితాలు ఇవ్వడం, గ్రామాల్లో వైకుంఠధామాలు, డంపింగ్ యార్డులు, నిరంతరం మొక్కలకు నీరు పెట్టడం, ప్రతి పంచాయతీకి మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారా గ్రామాల రూపురేఖలు మారిపోయాయని చెప్పారు. గ్రామాలు సాధించిన అభివృద్ధి కళ్లకు కట్టినట్టుగా కనిపిస్తుందన్నారు. 9 అంశాల్లో జిల్లాలోని 27 గ్రామాలు జిల్లాస్థాయి అవార్డులకు ఎంపికవడం అభినందనీయం అన్నారు. జిల్లా అభివృద్ధికి ప్రజాప్రతినిధులతోపాటు అధికారులు కలిసి పనిచేస్తామని కలెక్టర్ చెప్పారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సీతారామారావు, జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య, డీపీఓ వెంకటేశ్వర్లు, జెడ్పీ సీఈఓ జ్యోతి, ఆర్డీఓ అనిల్‌కుమార్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.



మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో ఉత్తమ పంచాయతీ అవార్డు అందుకుంటున్న గండేడ్ ఎంపీపీ మాధవి, జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ రూపేందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి మణెమ్మ తదితరులు

ఫైలేరియా నివారణకు చర్యలు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ఫైలేరియా వ్యాధి నివారణకు చర్యలు తీసుకోవాలని డిప్యూటీ డైరెక్టర్ విజయకుమార్ అన్నారు. టాస్ కార్యక్రమంలో భాగంగా శనివారం జిల్లాకేంద్రంలోని పాత డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో సిబ్బందికి శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫైలేరియా వ్యాధి నివారణకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రభుత్వ నియమ, నిబంధనల ప్రకారం కచ్చితంగా పరీక్షలు నిర్వహించాలని, ఈ వ్యాధి పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో మహబూబ్‌నగర్, రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది, లాబ్ టెక్నీషియన్లు, హెల్త్ అసిస్టెంట్లు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు. స్టేట్ టీం డాక్టర్ తుకారం సిబ్బందికి ఆయా అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం డీఎంహెచ్‌ఓ కృష్ణ, జిల్లా మలేరియా అధికారి శ్వేత, ప్రోగ్రామింగ్ ఆఫీసర్లు మాట్లాడుతూ సర్వేలో నిర్దేశించబడిన స్కూళ్లలో ఒకటి, రెండు తరగతుల పిల్లలకు ఈ నెల 27 నుంచి వారం రోజులపాటు పరీక్షలు జరుపుతారన్నారు. ఫైలేరియా వ్యాధి సమాజంలో ఎంత శాతం ఉందో గుర్తించడానికి ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు డాక్టర్ శ్వేత చెప్పారు. పరీక్షలో నిర్ధారణ అయిన ఫైలేరియా వ్యాధి గ్రస్తులకు తగిన చికిత్స అందిస్తామని వివరించారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి రమేష్ కుమార్, రమణ, కిరణ్, జానకిరాం, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.



ఫైలేరియా పరీక్షలు ఎలా చేయాలో అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

బీఆర్‌ఎస్‌ను గద్దె దింపే రోజులు దగ్గరలోనే..



మాట్లాడుతున్న ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూర్ వెంకట్

స్టేషన్ మహబూబ్‌నగర్: రాష్ట్రంలో ప్రజాదారణ కోల్పోవడంతో సీఎం కేసీఆర్ టీఆర్‌ఎస్ నుంచి బీఆర్‌ఎస్‌గా మార్చారని, రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ఓటమి తప్పదని ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూర్ వెంకట్ అన్నారు. టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీక్, రాహుల్‌గాంధీ ఎంపీ సభ్యత్వానికి అనర్హత వేటు వేయడాన్ని వ్యతిరేకిస్తూ ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి ముకుందం రమేశ్ ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలో శనివారం నిరసన చేపట్టారు. న్యూటౌన్ చౌరస్తా నుంచి ప్రభుత్వ బాలుర కళాశాల, పాత డీఈఓ కార్యాలయం, ఎర్రసత్యం చౌరస్తా నుంచి తెలంగాణ చౌరస్తా వరకు ర్యాలీ తీశారు. నిరసనలో పాల్గొన్న రాష్ట్ర అధ్యక్షులు బల్మూర్ వెంకట్ మాట్లాడుతూ టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకుతో లక్షలాది మంది యువత జీవితాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్‌ను గద్దెదింపే రోజులు దగ్గర వచ్చాయన్నారు. ప్రశ్నించే వారిని రాష్ట్ర ప్రభుత్వం అణగదొక్కేందుకు ప్రయత్నిస్తుందని ఆరోపించారు. డీసీసీ అధ్యక్షుడు జి.మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకుపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. కొట్లాడి తెచ్చుకున్న రాష్ట్రంలో ఉద్యోగాల కోసం యువత రోడ్డుమీదకి రావాల్సిన దుస్థితి దాపురించిందన్నారు. రాహుల్‌గాంధీ ఎంపీ సభ్యత్వంపై అనర్హత వేయడం అప్రజాస్వామికం అన్నారు. అనంతరం సీఎం కేసీఆర్, పీఎం నరేంద్రమోదీ దిష్టిబొమ్మలను దహనం చేశారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఎన్‌ఎస్‌యూఐ ఇన్‌చార్జ్ అక్షయ్ లత్రా, జాతీయ ప్రధాన కార్యదర్శి దినేష్‌సాగర్, రాష్ట్ర కార్యదర్శులు రమేశ్, శేఖర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శులు శివజ్యోతి, నవీన్‌యాదవ్, శ్యాంసుందర్, రమేశ్ సాగర్, మణి, కేశవులు, నాయకులు వసంత, బెనహర్, సిరాజ్ ఖాద్రీ తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ ఆశీర్వాదంతో ముందుకు..

భూత్పూర్: ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్, బీఆర్‌ఎస్ పార్టీ హయాంలోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని రావులపల్లిలో రూ.3 కోట్లతో రోడ్ కం హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన, రూ.20 లక్షలతో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణంతోపాటు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 75 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు తెలంగాణ రాష్ట్రం, సీఎం కేసీఆర్ ఆశీర్వాదంతో నియోజకవర్గంలో అనేక చెక్‌డ్యాంల నిర్మాణం, గ్రామాలకు బీటీ రోడ్డు సౌకర్యం, సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటికి ఏదో విధంగా లబ్ధి చేకూరిందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ శేఖర్‌రెడ్డి, చైర్మన్ బస్వరాజ్‌గౌడ్, విండో చైర్మన్ అశోక్‌రెడ్డి, సర్పంచ్ శ్రీనివాస్, మురళీధర్‌గౌడ్, రైతుబంధు అధ్యక్షుడు నర్సింహులుగౌడ్, నాయకులు నారాయణగౌడ్, రాములు, జాకీర్‌పాషా, ముడా డైరెక్టర్ సాయిలు తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు, హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

క్లుప్తంగా

వివాహిత బలవన్మరణం



శ్వేత (ఫైల్)

కల్వకుర్తి టౌన్: కుటుంబ కలహాలతో ఓ వివాహిత ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ రమేష్, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. పట్టణంలోని ఇందిరానగర్‌కాలనీకి చెందిన శ్వేత (29)కు తిమ్మాజీపేట మండలం కోడిపర్తికి చెందిన రవీందర్‌తో పదేళ్ల కిందట వివాహం జరిగింది. గత కొన్నిరోజులుగా కుటుంబంలో గొడవలు ప్రారంభం కావడంతో రెండ్రోజుల క్రితం శ్వేత తల్లిగారింటికి వచ్చి భర్త వేధిస్తున్నాడంటూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు అతడిని పిలిపించే లోపే శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుంది. తల్లి యాదమ్మ ఇంటికి వచ్చేసరికి ఫ్యాన్‌కు వేలాడుతుండటంతో చుట్టుపక్కల వారిని పిలిపించి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు ధ్రువీకరించారు. శ్వేతకు భర్త, కుమారుడు, కుమార్తె ఉన్నారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

తల్లి, కుమారుడు అదృశ్యం



దేవరకద్ర రూరల్: ఆస్పత్రికి చికిత్స కోసం వచ్చి తల్లి, కుమారుడు అదృశ్యమైన సంఘటన శనివారం మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గురుకొండకు చెందిన సంతోష, తన నాలుగేళ్ల కుమారుడితో ఈ నెల 6వ తేదీన మండల కేంద్రానికి ఆస్పత్రిలో చికిత్స కోసం వచ్చింది. తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. భర్త చెన్నకేశవులు శనివారం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ భగవంత్‌రెడ్డి తెలిపారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

మల్దకల్: బావిలో పడి ఓ వ్యక్తి అనుమానాస్పదంగా మృతిచెందాడు. ఈ సంఘటన శనివారం మండలంలోని ఎల్కూరు గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ శేఖర్ తెలిపిన వివరాలు.. ఎల్కూరుకు చెందిన దుబ్బన్న(50) ఇళ్ల నిర్మాణం కోసం వినియోగించే రాళ్లు కొడుతూ జీవిస్తున్నాడు. రోజులాగే శుక్రవారం గ్రామ సమీపంలో రాళ్లు కొట్టేందుకు మోటారుసైకిల్‌పై వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు ఆందోళన చెందారు. శనివారం గ్రామ సమీపంలోని ఓ వ్యవసాయ బావిలో దుబ్బన్న మృతదేహం లభ్యమైనట్లు ఎస్‌ఐ చెప్పారు. వెంటనే మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దుబ్బన్నను ఎవరైనా చంపి బావిలో వేసి ఉంటారని మృతుని సోదరుడు సుందర్‌రాజ్ అనుమానం వ్యక్తం చేస్తున్నాడు. ఈ మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

గట్టు: మండల కేంద్రానికి చెందిన చిన్న దేవన్న (30) శనివారం ఉదయం విద్యుదాఘాతానికి గురై మృతి చెందినట్లు ఏఎస్‌ఐ రాంచందర్‌జీ తెలిపారు. ఆయన కథనం మేరకు.. చిన్న దేవన్న ఉదయం బస్టాండ్ సమీపంలోని మద్యం దుకాణం వెనుక ఉన్న కిరాణం డబ్బా దగ్గరకు వెళ్లారు. పక్కనే ఉన్న తీగ తగలడంతో విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతిచెందాడు. భార్య శశికళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గద్వాల ఆస్పత్రికి తరలించినట్లు ఏఎస్‌ఐ వివరించారు.

అడవిజంతువు దాడిలో గేదె మృతి

కోడేరు: మండలంలోని పస్పులకు చెందిన మంగలి నిరంజన్ అనే రైతుకు చెందిన గేదె సమీపంలోని గట్టు వద్ద మేస్తుండగా అడవి జంతువు దాడి చంపింది. వారం రోజుల కిందట అదే గట్టు వద్ద అర్జునయ్య మేకలను మేపడానికి గట్టుపైకి వెళ్లగా, మందపై చిరుతపులి దాడి చేసి చంపిందని గ్రామస్తులు చెబుతున్నారు. పస్పులకు సమీపంలో గట్టు ఉండటంతో గ్రామస్తులు రాత్రి వేళలో బయటకు రావాలంటే భయాందోళన చెందుతున్నారు.

ఉరేసుకొని యువకుడు మృతి

వనపర్తి క్రైం: మనస్తాపంతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈసంఘటన శనివారం జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ..వనపర్తి జిల్లా కేంద్రంలోని రాయిగడ్డకు చెందిన శేఖర్ కుమారుడు మహేష్(21) ప్రైవేటు ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. అయితే అతను తీవ్ర మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకున్నాడు. ఈ సంఘటనపై తండ్రి శేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పట్టణ ఎస్‌.ఐ.యుగంధర్ రెడ్డి తెలిపారు.

ప్రసాద్ స్కీం పనుల పరిశీలన

- ఏఎస్‌ఐ అధికారులపై అసహనం
- పనులపై సమీక్ష నిర్వహించిన కలెక్టర్ వల్లూరి క్రాంతి



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్



ప్రసాద్ స్కీం భవనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వల్లూరి క్రాంతి

సాక్షి ఎఫెక్ట్..

జోగుళాంబ శక్తిపీఠం: ప్రసాద్ స్కీం కింద చేపడుతున్న అభివృద్ధి పనుల ఆటంకానికి పరిష్కారం ఏమిటని కలెక్టర్ వల్లూరి క్రాంతి ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. శనివారం కలెక్టర్ అలంపూర్‌లో చేపడుతున్న ప్రసాద్ స్కీం పనులను పరిశీలించారు. శనివారం సాక్షిలో ప్రచురితమైన 'అభివృద్ధికి అడ్డంకులు తొలిగేనా? కథనానికి స్పందించారు. కాగా కలెక్టర్ వస్తున్నారని తెలియడంతో కేంద్ర పురాతత్వ శాఖ, రాష్ట్ర పర్యాటక శాఖ, ఎండోమెంట్, మున్సిపల్, రెవన్యూ, ఇరిగేషన్‌శాఖల అధికారులు హుటాహుటిన ఆలయం వద్దకు చేరుకున్నారు. నవ బ్రహ్మ ఆలయాల వద్ద వెంటనే ప్రహరీ నిర్మాణం ప్రారంభించాలని పర్యాటక శాఖ డీఈ ధన్‌రాజ్‌ను ఆదేశించారు.

అనుమతులు ఇవ్వాలని ఆదేశాలు..

ఆలయాలకు వచ్చే భక్తుల సౌకర్యం కోసం బస చేసే విధంగా క్లాక్ రూం, శౌచాలయాలు, విశాలమైన హాల్ నిర్మాణం కోసం పబ్లిక్ ఎమినిటి నిర్మాణం కోసం కేంద్ర పురాతత్వ శాఖ అనుమతులు ఇవ్వడం లేదంటూ ఈఈ పురేందర్‌కుమార్ కలెక్టర్‌కు తెలిపారు. వెంటనే కలెక్టర్ ఆర్కియాలజికల్ డిప్యూటీ సూపరింటెండెంట్ రోహిణి, ఏఈ శరవణన్‌ను వివరణ కోరగా.. ప్రతిపాదనలు తయారు చేసి డైరెక్టర్ జనరల్ అనుమతుల కోసం లేఖ రాయాలని తెలిపారు. రాష్ట్ర పురావస్తు ప్రదర్శన శాలను సందర్శించారు. అక్కడి శిల్ప కళా వైభవాన్ని చరిత్రను ఆలయ సీనియర్ అసిస్టెంట్ రంగనాథ్ కలెకర్టర్‌కు వివరించారు. ప్రదర్శనశాల పైభాగంలో లైట్ అండ్‌ సౌండ్ షోను యాత్రికులు వీక్షించేందుకు ప్రదర్శన శాల బయట నుంచి మెట్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. అనంతరం ఆలయాలను దర్శించి పుష్కరఘాట్ వద్ద అన్నదాన సత్రం కోసం నిర్మించాలనుకున్న స్థలాన్ని పరిశీలించి ఆర్కియాలజికల్ అధికారుల నుంచి ఎదురవుతున్న అభ్యంతరాలపై సంబంధిత అధికారులను వివరణ కోరారు. ప్రసాద్ స్కీం భవనంలో అన్నదాన సత్రంకు స్థలం కేటాయించారని, అందుకే ఇక్కడ అభ్యంతరం చెప్పామన్నారు. దేవస్థానం వారు ఆగమాల ప్రకారం భగవంతుడి నివేదన బయట నుంచి తయారు చేసి తీసుకురావడం కుదరదని, ఆలయ ఆవరణంలోనే మడిగా అన్న ప్రసాదాల తయారు చేయాల్సి ఉంటుందన్నారు. పుష్కరఘాట్ వరకు రావాల్సిన అప్రోచ్ రోడ్డుకు అడ్డంగా కొన్ని నివాస గృహాలు ఆక్రమించడంతో వాటిని కలెక్టర్ పరిశీలించారు.

భవనం పరిశీలన

ప్రసాద్ స్కీం కింద నిర్మిస్తున్న మూడంస్తుల భవన నిర్మాణాన్ని కలెక్టర్ పరిశీలించారు. మూడు అంతస్తులలో చేపడుతున్న నిర్మాణాలు, అన్నదాన సత్రం, కల్యాణ మండపం, భక్తుల విడిది గదులు, యాంపీ థియేటర్, ఫుడ్ కోర్టు అంశాలను పర్యాటక శాఖ డీఈ ధన్‌రాజ్ వివరించారు. అదేవిధంగా తుంగభద్ర నది బ్రిడ్జి వద్ద మినీ బస్‌బే నిర్మాణాన్ని పరిశీలించి, అక్కడ కల్వర్టు నిర్మించాలని పర్యాటక శాఖ అధికారులకు ఆదేశించారు.

పరిష్కారం ఏమిటి?

దక్షిణకాశీ భవన్‌లో కలెక్టర్ దేవదాయ శాఖ, ఇరిగేషన్, పర్యాటక, ఆర్కియాలజికల్, మున్సిపల్, రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రసాద్‌స్కీం, ఆలయ అభివృద్ధి పనులపై పురాతత్వ నిబంధనలు అడ్డు వస్తున్నాయని పదే పదే ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా అధికారులు అభ్యంతరాలు చెబుతుండటంతో కలెక్టర్ ఒక్కసారిగా అసహనానికి లోనయ్యారు. అన్నింటికి అభ్యంతరాలు సరే మరీ పరిష్కారం కూడా మీరే చెప్పాలిగా అన్నారు. దేవస్థానం నిధులతో ఆర్చిగేట్లు నిర్మాణం కోసం స్థలం సూచించాలన్నారు. దీంతో మున్సిపల్ శాఖ వారు టూరిజం వద్ద కట్టడం వల్ల అందగా ఉంటుందని తెలిపారు. బుడిదపాడు, భైరాపురం చౌరస్తా వద్ద నంది ఈశ్వరుడి విగ్రహాలను ఏర్పాటు చేస్తామని తద్వారా భక్తయాత్రికులకు ఆధాత్మిక వాతావరణం ఉట్టిపడే విధంగా ఉంటుందని ఈఓ, చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి కలెక్టర్‌ను కోరారు. హైవే అథారిటీ వారితో మాట్లాడి అనుమతి కూడా ఇప్పిస్తానని అలంపూర్ చౌరస్తాలోని ఫ్లై ఓవర్ బ్రిడ్జికి ఆలయ చరిత్ర, ఇక్కడి ప్రాశస్త్యం వివరించే చిత్రాలను రంగులతో పెయింటింగ్ వేయించాలని తెలిపారు. నదికోట గోడను ఆనుకుని ఉన్న కాల్వలో పేరుకుపోయిన పూడికలు తీయించాలని ఇరిగేషన్ ఈఈ విజయ్‌కుమార్ ఆదేశించారు. స్థానిక మున్సిపల్ అధికారులు, టీపీఓ, ఏఈతో మాట్లాడుతూ రోడ్డు పనులు ఎప్పుడు పూర్తి చేస్తారని ప్రశ్నించగా మరో మూడు నెలలో పూర్తి చేస్తామని సమాధానం ఇచ్చారు. కార్యక్రమలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ సుభాష్‌నాయుడు, కలెక్టర్ సీసీ భూపాల్‌రెడ్డి, దౌలమ్మ, ఆర్‌ఐ శ్రీవాణి ఉన్నారు.

భారీగా నల్లబెల్లం స్వాధీనం: కారు సీజ్



మన్ననూర్: భారీగా నల్లబెల్లం స్వాధీనం చేసుకున్నామని, కారు సీజ్ చేశామని ఎక్సైజ్ ఎస్‌ఐలు బాల్‌రాజ్, సతీష్‌కుమార్ తెలిపారు. శనివారం మన్ననూర్–అమ్రాబాద్ ప్రధాన రహదారిలో తమ సిబ్బందితో కలిసి రహదారి తనిఖీలు నిర్వహించామని అన్నారు. ఈక్రమంలో మన్ననూర్ గ్రామానికి చెందిన కూరాకుల రాజు కారులో వస్తుండగా, అనుమానం వచ్చి వాహనాన్ని ఆపే క్రమంలో నిందితుడు వాహనాన్ని అక్కడే విడిచిపెట్టి పరారయ్యాడు. వాహనంలో 210 కేజీల నల్లబెల్లం, 50 కేజీల పటిక స్వాధీనం చేసుకున్నామని, అచ్చంపేట ఎక్సైజ్ కార్యాలయానికి తరలించి కేసు నమోదు చేశామని తెలిపారు. ఈ తనిఖీల్లో ఎక్సైజ్ సిబ్బంది నవీన్, బంతిలాల్ పాల్గొన్నారు.

1,019 అగుగుల నీటిమట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో శనివారం 1,019 అడుగుల వరకు నీరు వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 100 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. సమాంతర కాల్వ నీటిని నిలిపివేశారు. ఎన్టీఆర్ కాల్వ ద్వారా 70, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు నీటిని వినియోగిస్తున్నారు.

ప్రజాస్వామ్య చరిత్రలో చీకటి రోజు



మాట్లాడుతున్న ములుగు ఎమ్మెల్యే సీతక్క

మరికల్: దేశ ప్రజల హక్కుల కోసం, రాజ్యాంగ పరిరక్షణ కోసం నిజాలు మాట్లాడిన రాహుల్‌గాంధీ లోక్‌సభ సభ్యత్వం రద్దు చేయడాన్ని ప్రజాస్వామ్య చరిత్రలో చీకటి రోజని ములుగు ఎమ్మెల్యే సీతక్క పేర్కొన్నారు. కర్ణాటక రాష్ట్రంలో ఎన్నికల ప్రచార నిమిత్తం రాయిచూర్ వెళ్తున్న ఆమె శనివారం మరికల్‌లో ఆగారు. కాంగ్రెస్ నాయకులు రఘు ఇంట్లో అల్పాహారం చేశాక, విలేకరులతో మాట్లాడారు. దేశ సంపదను కార్పొరేట్ కంపెనీలకు తాకట్టు పెట్టించిన ప్రధాని మోదీ నాయకత్వంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందన్నారు. అదానీ అక్రమాలపై పార్లమెంట్‌లో మాట్లాడిన రాహుల్‌గాంధీ నోరు నొక్కడం కోసమే లోక్‌సభ సభ్వత్యం రద్దు చేయడం హేయమైన చర్య అన్నారు. గుజరాత్ కంపెనీలు దేశం మీదపడి దోచుకుంటున్నాయని, దీనికి ప్రధాని దేశ ప్రజలకు ఏం సమాధానం చెప్తారని ప్రశ్నించారు. బీజేపీ ప్రభుత్వం పెట్టిన కేసులకు భయపడే ప్రసక్తే లేదన్నారు. రాహుల్‌గాంధీ వెంటఉండి పోరాటం చేస్తామన్నారు. అలాగే రాష్ట్రంలో టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీలతో ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందన్నారు. ఈసమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వీరన్న, నాగరాజ్, మల్లయ్య, గోపి, లక్ష్మయ్య, కట్టెప్ప, మహేష్, ఆంజనేయులు, వెంకటేష్, రఘు, మాహేందర్, పాల్గొన్నారు.

చిరుధాన్యాలకు విశేష ప్రాధాన్యం

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): చిరుధాన్యాల విక్రయాల కోసం శిల్పారామంలో ప్రత్యేక స్టాల్ ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శనివారం జెడ్పీ హాల్‌లో చిరుధాన్యాల ఉత్సవం-2023 కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆహార అలవాట్లు మార్పుల కారణంగా ప్రపంచ వ్యాప్తంగా చిరుధాన్యాలకు విశేషమైన ప్రాధాన్యం లభిస్తోందన్నారు. భవిష్యత్‌లో ఈ రంగానికి మంచి డిమాండ్ ఉండబోతుందన్నారు. చిరుధాన్యాలు పండిస్తున్న రైతులకు సరైన మార్కెటింగ్ సౌకర్యం ఉండేలా బాధ్యతను కూడా అధికారులు తీసుకోవాలన్నారు. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చి ఏర్పాటు చేసిన చిరుధాన్యాలను పరిశీలించారు. జిల్లాలో మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపనకు ఔత్సాహికులు ముందుకు వస్తే అవగాహన కల్పించాలన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపనకు ముందుకు వచ్చేవారికి ప్రభుత్వం గరిష్ఠంగా రూ.10 లక్షల రాయితీ ఇవ్వనున్నట్లు చెప్పారు. వివిధ ఆహార ఉత్పత్తులు తయారు చేసి జీవించే మహిళా సంఘాలకు గతేడాది సుమారు రూ.18.50 కోట్ల వడ్డీ లేని రుణాలను ఇచ్చామన్నారు. చిరుధాన్యాల ప్రాసెసింగ్ సెంటర్ల కోసం మహిళా సంఘాలకు రుణాలు అందించి సహకరిస్తామన్నారు. కార్యక్రమంలో ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీస్ డైరెక్టర్ ప్రవీణ్, డీడీ అభయ్, సీఐసీ మిలెట్స్ ఈజీఓ అనిలాకుమారి, ఆకాంక్ష శర్మ, సుష్మ, మున్సిపల్ కమిషనర్ ప్రదీప్, జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్, పరిశ్రమల శాఖ జీఎం బాబురావు, మెప్మా రాష్ట్ర కోఆర్డినేటర్ ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

సిరసనగండ్ల బ్రహ్మోత్సవాలు విజయవంతం చేయాలి



వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న జెడ్పీచైర్‌పర్సన్ శాంతాకుమారి, ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు

చారకొండ: సిరసనగండ్ల సీతారామచంద్రస్వామి బ్రహమ్మత్సవాలను అధికారులు, అయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, ఆలయ ట్రస్టు ఆధ్వర్యంలో విజయవంతం చేయాలని జెడ్పీచైర్‌పర్సన్ శాంతా కుమారి, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. శనివారం మండలంలోని సిర్సనగండ్ల సీతారామచంద్రస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలపై సమీక్ష నిర్వహించగా.. వారు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ నెల 30వ తేదీన బ్రహ్మోత్సవాలు ఆరంభమవుతాయని, వచ్చే నెల 2వ తేదీన రథోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆలయ అభివృద్ధికి జెడ్పీ నిధుల నుంచి రూ.25లక్షలు మంజూరు చేస్తానని, బ్రహోత్సవాలకు విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని జెడ్పీచైర్‌పర్సన్ ఆదేశించారు. అనంతరం ఆలయానికి మొదటిసారిగా వచ్చిన ఆమెను ఆలయ ట్రస్టు ఆధ్వర్యంలో సన్మానించారు. అనంతరం బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ నిర్మల విజేందర్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ గుర్వయ్యగౌడ్, జూపల్లి వెంకటయ్యయాదవ్, కోఆప్షన్ సభ్యులు సలీం, అయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని రైల్వే ఉద్యోగి దుర్మరణం

యాదగిరిగుట్ట రూరల్: రైలు ఢీకొని రైల్వే ఉద్యోగి మృతిచెందాడు. ఈ ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలంలోని వంగపల్లి రైల్వే ట్రాక్ పరిధిలో శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. జీఆర్‌పీ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన బి.దశరథమ్ (44) సిగ్నల్, టెలికమ్ డిపార్ట్‌మెంట్‌లో ఈఎస్‌ఎమ్ గ్రేడ్-1 ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నాడు. రోజువారీ విధుల్లో భాగంగానే వంగపల్లి పరిధిలోని రైల్వే ట్రాక్ పక్కన సిగ్నల్స్‌కు సంబంధించిన మిషన్ పాయింట్ బాక్స్ 106 బి వద్ద మిషన్లను తనిఖీ చేస్తున్నాడు. ఈ సమయంలో వరంగల్ నుంచి హైదరాబాద్ వైపునకు వెళ్తున్న తెలంగాణ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొట్టింది. దీంతో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

ఫోరెట్ గుళికలు తిని వ్యక్తి మృతి

ఎర్రవల్లిచౌరస్తా: ఫోరెట్ గుళికలు తిని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన ఇటిక్యాల మండలంలోని షేకుపల్లిలో చోటు చేసుకుంది. ఎస్సై వెంకటస్వామి కథనం మేరకు.. గ్రామానికి చెందిన బీసిరెడ్డి (45) అప్పులబాధతో కొన్నిరోజుల క్రితం మనస్థాపంతో గ్రామ సమీపంలోని చెరుకు పంట పొలంలో ఫోరెట్ గుళికలు తిని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శనివారం పంటను కోస్తున్న వ్యక్తులు మృతదేహాన్ని గుర్తించి స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు మృతదేహాన్ని పరిశీలించగా పూర్తిగా కుళ్లిపోయి ఉండటంతో అక్కడే పోస్టుమార్టం చేయించారు. అనంతరం కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అంత్యక్రియలు చేశారు. మృతుని భార్య జయ్యమ్మ ఫిర్యాదు మేరకు ఈ సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

డ్రిప్ పైపులు దగ్ధం



ఊట్కూర్‌లో దగ్ధమైన షెడ్డు, డ్రిప్ పైపులు

ఊట్కూర్: గ్రామ శివారులో పొలం వద్ద నిల్వ ఉంచిన డ్రిప్ పైపులు ప్రమాదవశాత్తు దగ్ధమై రూ.2లక్షల నష్టం వాటిల్లిన సంఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గాళ్ల ఉమేశ్, గాళ్ల నీల్‌రాజ్ అనే రైతులు డ్రిప్ ల్యాటర్స్, ప్లాస్టిక్ పైపులు, స్ప్రింక్లర్లు తదితర పరికరాలు పొలం వద్ద రేకుల షెడ్డులో నిల్వ చేశారు. శుక్రవారం రాత్రి ప్రమాదవశాత్తు పొలం గట్లకు నిప్పు అంటుకొని షెడ్డు, డ్రిప్ పైపులు పూర్తిగా కాలిపోయాయి. దాదాపు రూ.2లక్షల నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరారు.

వివాహిత అదృశ్యం: కేసు నమోదు

గోపాల్‌పేట: వివాహిత అదృశ్యమైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ మల్లేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పొలికెపాడుకు చెందిన లలిత తన భర్తతో బుధవారం ఇంట్లో గొడవ పడి, గురువారం ఉదయం బయటికి వెళ్లి వస్తానని చెప్పి తిరిగి రాలేదు. ఆ తర్వాత ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో శనివారం భర్త కాశయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

- 12 మంది అరెస్ట్, రూ.31 వేలు స్వాధీనం

కొత్తకోట: పట్టణంలోని కుమ్మరికుంటవీధిలో ఓ వ్యక్తి ఇంటి ఎదుట పేకాట ఆడుతున్నారని సమాచారం అందుకున్న పోలీసులు శనివారం దాడి చేశారు. 12 మందిని అదుపులోకి తీసుకొని వారి నుంచి 9 బైక్‌లు, 6 సెల్‌ఫోన్లు, రూ.31 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ నాగశేఖర్‌రెడ్డి తెలిపారు.

యువతి ఆత్మహత్య

భూత్పూర్: మున్సిపాలిటీలోని అమిస్తాపూర్‌కు చెందిన రేకులపాటి నందిని(19) అనే యువతి శనివారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రేకులపాటి బూరప్ప కుమార్తె నందిని రెండు రోజుల క్రితం కుటుంబ సభ్యులు గొడవ పడ్డారు. ఈ క్రమంలోనే శనివారం రాత్రి సైతం తల్లిదండ్రులు ఇంటి ఎదుట గొడవ పడుతుండటంతో మనస్తాపానికి గురై క్షణికావేశంలో ఇంట్లోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం తెలుసుకున్న సీఐ రజితా రెడ్డి, ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి వివరాలు తెలుసుకుని.. నందిని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

54కి.మీ. ట్రాక్ విద్యుద్దీకరణ పూర్తి



విద్యుద్దీకరణ పనులను పరిశీలిస్తున్న రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ ఇంజినీర్ పీడీ మిశ్రా

గద్వాల: స్థానిక రైల్వేస్టేషన్‌లోని ట్రాక్ విద్యుద్దీకరణ పనులను సౌత్ సెంట్రల్ రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ ఇంజినీర్ పీడీ మిశ్రా పరిశీలించారు. శనివారం ఆయన గద్వాల నుంచి కర్నూల్ రైల్వే మార్గంలో పర్యటించి, అక్కడ చేపట్టిన ట్రాక్ విదుద్దీకరణ పనులను పరిశీలించారు. 2018-19 రైల్వే బడ్జెట్‌లో మన్మాడ్-ముద్దేడ్-డోన్ వరకు గల 769 కిలోమీటర్ల రైల్వే ట్రాక్ విద్యుద్దీకరణ పనులకు రూ.916.07కోట్లు మంజూరయ్యాయి. కర్నూల్ -డోన్, మహబూబ్‌నగర్-గద్వాల స్టేషన్ల మధ్య విద్యుద్దీకరణ పనులు కొన్ని నెలల క్రితమే పూర్తయ్యాయి. తాజాగా గద్వాల-కర్నూల్ రైల్వేస్టేషన్ల మధ్య ఉన్న 54కిలోమీటర్ల ట్రాక్ విద్యుద్దీకరణ పనులు పూర్తయ్యాయి. పనులు పూర్తి కావడంతో కాచిగూడ-బెంగళూరు మధ్య కొత్త వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రవేశపెట్టాలని అధికారులు కసరత్తు చేస్తున్నారు.